క్లుప్తంగా

శాలిగ్రామ అభిషేకం



నారసింహునికి పంచ హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ కనకవల్లీ సమేత నరసింహ స్వామివారి ఆలయంలో స్వామికి ఆదివారం సాయంత్రం ప్రదోషకాల శాలిగ్రామ అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారు చతుర్దశి తిథిన ప్రదోష కాలంలో ఆవిర్భవించారని, ఆ సమయాన్న ఈ అభిషేకాన్ని జరపడం విశేషమని పండితులు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భక్తురాలు తాడేపల్లిగూడెంకు చెందిన పెండ్యాల కనకమహాలక్ష్మి ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వేడుకగా శివయ్యకు రుద్రాభిషేకం

క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలో అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రధాన అర్చకులు సుజిత్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్వర్టు కష్టాలు



కన్నాపురంలో కల్వర్టు మీదుగా తాడు కట్టుకుని దిగుతున్న దృశ్యం



కల్వర్టు వద్ద నిచ్చెన వేసుకుని ఎక్కుతున్న వ్యవసాయ కూలీలు

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు
- నాసిరకం పనులే కారణమని ఆరోపణ
- కల్వర్టు యుద్ధప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలోని కన్నాపురం, బుట్టాయిగూడెం మండలం యర్రాయిగూడెం గ్రామాల ప్రజలు కల్వర్టు కష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూర్పు కాలువ వరద ప్రవాహం ముంచెత్తడంతో ఇక్కడి కల్వర్టు కొట్టుకుపోయింది. గతేడాది శిథిలావస్థకు చేరిన కల్వర్టు వద్ద కొయ్యలగూడెం మండల పరిషత్తు ద్వారా నిర్వహించిన నాసిరకం పనులు కల్వర్టు కొట్టుకుపోవడానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు లేకపోవడం వలన ఇరు మండలాలకు చెందిన కొన్ని గ్రామాల ప్రజలు పదిహేను కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో చేసేది లేక రెండు మండలాల్లోకి రాకపోకలు సాగించే ప్రజలు, వ్యవసాయ కూలీలు ప్రమాదకరమని తెలిసినా కల్వర్టు వద్ద తాడులు పట్టుకుని, నిచ్చెన వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పశువులు రాకపోకలు సాగించక పోవడంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు వాపోయారు. కల్వర్టు కొట్టుకుపోవడంతో వరద ప్రవాహం కన్నాపురం వైపు ముంచెత్తుతోందని, గట్టు కోతకి గురవడంతో సమీపంలోని ఇళ్లు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ప్రమాదపుటంచున ఉన్నాయన్నారు. గిరిజన గ్రామాలైన యర్రాయిగూడెం, బుల్లింపేట ప్రజలకు అత్యవసర సేవలు పొందాలి అంటే కన్నాపురం చేరుకోవడానికి కల్వర్టు ఒకటే ప్రధాన మార్గంగా ఉంది. రాకపోకలు నిలిచిపోవడంతో అత్యవసర సేవలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కల్వర్టును యుద్ధప్రాతిపదికన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకం పనులతో..



గతేడాది కూటమి ప్రభుత్వం కల్వర్టు అభివృద్ధి పేరిట సుమారు రూ.5 లక్షలు వెచ్చించి పనులు నిర్వహించారు. ఆ సమయంలో పనులు నాసిరకంగా జరుగుతున్నాయని మేము ఆందోళన చేశాం. ఇప్పుడు కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమీపంలోని ఇళ్లు కూడా కొట్టుకుపోయే పరిస్థితి ఉంది.

– ముప్పిడి కనిష్ట కుమార్, కన్నాపురం

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



కొన్ని గిరిజన గ్రామాల ప్రజలకు కల్వర్టు అత్యవసర మార్గం. ఇది పూర్తిగా కొట్టుకపోవడంతో అత్యవసర వాహనాలు గ్రామాలకు చేరుకోలేక పోతున్నాయి. దీంతో ప్రాణాపాయ పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. పశువులు రాకపోకలు సాగించకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

– ఎం మనోహర్, (సివిల్ ఇంజనీర్) కన్నాపురం

21న క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం : ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ నందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి అండర్–14, అండర్–17 బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ పోటీల్లో ఎంపికలు జరగనున్నాయి. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ప్రధానోపాధ్యాయులు పి.సోమశేఖర్ కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



కైకలూరులో డీఎన్నార్‌ను కలిసిన నేతలు

చింతలపూడి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వర్రావు సూచించారు. కై కలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం చింతలపూడి పార్టీ ముఖ్య నాయకులు జిల్లా అధక్షుడు దూలం నాగేశ్వర్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 24న చింతలపూడిలో తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ఆయన్న ఆహ్వానించినట్లు మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వర్రావు తెలిపారు. డీఎన్నార్‌ను కలిసిన వారిలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి ఏ సుబ్బారావు, రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శి గోలి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కే చండీప్రియ, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు ఇమ్మానియేలు, ఎస్టీ సెల్ నాయకులు రామరాజు నాయక్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఎం గురుబ్రహ్మం, కాటూరి ఏలియ, పి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కుక్కునూరు: రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు మండల కేంద్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ సీసీఐ కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో పత్తి ప్రైవేటు వ్యాపారస్తులకు తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని కోనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీమహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరకా శ్యామల, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటాచారి, సహాయ కార్యదర్శి కురాకుల బాబురావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంట శివారులో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి దాడి చేశారు. దాడిలో 5 గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.41,200 నగదు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

తగ్గుతున్న వరద

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జల్లేరు జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం ఎర్రకాలువ జలాశయం డీఈ సునీత, ఏఈ రాహుల్ సిబ్బందితో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ఆదివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 82.79 మీటర్ల వద్ద ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు అని తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1875 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 2274 క్యూసెక్కులుగా ఉందని తెలియజేశారు.

కరాటేలో అలేఖ్యకు గిన్నిస్ రికార్డు

కొయ్యలగూడెం: చెన్నై తాంబరంలో నిర్వహించిన కరాటే పోటీల్లో కొయ్యలగూడెంకి చెందిన దాసరోజు అలేఖ్య ప్రతిభ కనబరిచి గిన్నిస్ రికార్డు సాధించినట్లు కోచ్ శ్రీధర్ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా అలేఖ్యకు రూ.25 వేలు బహుమతి అందజేశారన్నారు. సౌత్ ఇండియా జపాన్ కరాటే అసోసియేషన్‌లో అలేఖ్య గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిందన్నారు.